సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం, 1, నవంబర్, 2023



కోట స్థలాలు ఆక్రమణ

గుర్రంకొండ కోట స్థలాలను కొంతమంది జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకున్నారు. అలాగే అక్కడే ఉన్న పురావస్తుశాఖ బోర్డును ఆక్రమణదారులు పీకేశారు. -8లో



ముగిసిన అమర వీరుల వారోత్సవాలు

భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు అమర వీరుల వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. -8లో

గరిష్టం/కనిష్టం
35.5/24.7

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.7 – 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీఎస్‌ఓగా బాధ్యతలు

కడప సెవెన్‌రోడ్స్: గాలేరు నగరి సుజల స్రవంతి భూసేకరణ విభాగం–2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కౌసర్ భానుకు జిల్లా పౌర సరఫరాల అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఆమె ఎఫ్‌ఏసీగా కొనసాగాలని సూచించారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 సంవత్సరంలో 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7వతేదీ వరకు గడువు పొడగించినట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో అన్నమయ్య, కడప జిల్లాల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు www.navodaya.gov.in సంప్రదించాలని తెలిపారు. 2014 ఫిబ్రవరి,10న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పీజీ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, ప్రిన్సిపల్, సీఈ తదితరులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి మంగళవారం విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ గత నెలలో పీజీ పరీక్షలు నిర్వహించామని, అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేశామని తెలిపారు. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఏజీ.దాము, ఆచార్య పి.పద్మ, ఆచార్య రఘుబాబు, డా.ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు భూమిపై సర్వ హక్కులు

ముద్దనూరు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2008–14 మధ్య ఎస్సీ కార్పొరేషన్‌లో మార్టిగేజ్‌లో ఉన్న వాటిని రిలీజ్ చేయించి ఎస్సీలకే భూమిపై సర్వ హక్కులు కల్పించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డా.హెచ్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. తహశీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాలో 1748 మంది ఎస్సీ రైతులకు చెందిన 1972.51 ఎకరాల భూములకు మార్టిగేజ్ నుంచి విముక్తి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని కార్యక్రమాలు పూర్తి చేయిస్తామన్నారు.

నీటి కుళాయిల పరిశీలన

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో జల్ జీవన్ మిషన్ అమలును అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం అకస్మికంగా పరీక్షించారు. స్థానిక అరుంధతి కాలనీ, హరిజనవాడలో ఆయన పర్యటించి నీటి కుళాయిలను పరిశీలించారు. ప్రతి ఇంటికీ కుళాయి వేయించాలని స్థానికులు అసిస్టెంట్ కలెక్టర్‌కు విన్నవించారు. పథకం ఆశయం మేరకు అందరి ఇళ్లకు కుళాయిలు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి దీప్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అరకోణం ప్యాసింజరు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–అరక్కోణం మధ్య నడుస్తున్న అరక్కోణం ప్యాసింజరును నవంబరు 12వ తేదీ వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. అక్టోబరు 25 నుంచి ఈ రైలు ద్దు చేశామని, దీనిని నవంబరు 12 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు.

జయంతి...దారి మళ్లింపు: పుణె–కన్యాకుమారి మధ్య నడుస్తున్న జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు (16381/16382)ను నవంబరు 6వ తేదీ నుంచి 12 వతేదీ వరకు దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రైలు పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా వారంరోజుల పాటు నడుస్తుందని, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట, తిరుపతి రైల్వేస్టేషన్లకు పైన తెలిపిన తేదీ ల్లో రైలు రాదని జనార్దన్ పేర్కొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: స్వయం సహాయక సంఘాల్లో మొండి బకాయిలను వందశాతం వసూలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద నాయక్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, వీవోఏలను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. పీడీ మాట్లాడుతూ గ్రామ సంఘం వారీగా సమీక్షించి రెండు నెలల్లో బకాయిలు వసూలు చేసేలా చూడాలన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రమణారెడ్డి, స్త్రీనిధి మేనేజర్లు హాజరయ్యారు.

శిబిరంలో వైద్యం.. ఆరోగ్యానికి అభయం

జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించే దిశగా అడుగులు పడ్డాయి. ఈ కార్యక్రమం ద్వారా చేపట్టిన వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. చిన్నా..పెద్ద జబ్బులతో పాటు సీజనల్ వ్యాధుల కాలంలో ఈ మెడికల్ క్యాంపులను నిర్వహించడం జనాలకు పెద్ద ప్రయోజనమే చేకూర్చింది. ప్రభుత్వ సంకల్పంతో ఆరోగ్యానికి అభయం లభించినట్లయింది.

- ముగిసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- చెంతకే వచ్చిన వైద్య నిపుణులు
- చిన్నా, పెద్ద జబ్బులకు వైద్యం
- వైద్య శిబిరాలకు పోటెత్తిన జనం



'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

కడప రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ఎన్నో కార్యక్రమాలు రూపుదిద్దుకుని విజయవంతంగా అమలవుతున్నాయి. తాజాగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఎందరికో ప్రయోజనం చేకూర్చి మంగళవారం దిగ్విజయంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 605 శిబిరాలు నిర్వహించగా.. దాదాపు 1,76,635మంది వైద్య చికిత్స చేయించుకున్నారు. వీరికి బీపీ, షుగర్, ఈసీజీ, తదితర ముఖ్యమైన పరీక్షలు జరిపి రోగ నిర్ధారణ చేయగడమేగాక, వైద్య నిపుణులు చూసి విలువైన మందులు ఉచితంగా అందజేశారు.

నెల రోజులు.. వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సెప్టెంబరు 30వ తేదీన జిల్లాలో లాంఛనంగా ప్రారంభమైంది. అంతకు ముందే సన్నాహక కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా ప్రాంతాల్లోని వాలంటీర్లు, వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించారు. అనంతరం మెడికల్ క్యాంపుల ఏర్పాటుకు సన్నాహకాలు ప్రారంభించారు. సెప్టెంబర్ 30 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. నాటినుంచి సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వార్డుల వారీగా మెడికల్ క్యాంపులను నిర్వహించారు. ఆయా ప్రాంతానికి పెద్దాసుపత్రే తరలి వచ్చిందా..? అనేలా ఈ శిబిరాలను యంత్రాంగం నిర్వహించింది.

జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం వివరాలు

వైద్య శిబిరాలు మొత్తం:	605
వైద్య పరీక్షల రకాలు :	14
మందుల రకాలు :	105
హాజరైన ఔట్ పేషెంట్స్:	1,76,635
ఆరోగ్యశ్రీకి రెఫర్ చేసిన వారు :	2,456

వ్యాధులకు...అడ్డుకట్ట

ఈ మెడికల్ క్యాంపుల ద్వారా ఇప్పటికే ఉన్న జబ్బులున్న వారికి వైద్యం లభించింది. అలాగే అనుమానాస్పద రోగాలతో బాధపడుతున్న వారికి వ్యాధి గుర్తించి పరీక్షలు నిర్వహించడం, చికిత్స ద్వారా రోగాన్ని నయం చేసి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం శిబిరాలు నిర్వహించింది. ఈ మెడికల్ క్యాంపుల్లో 104 సంచార వాహనం ద్వారా గుండెజబ్బుల నిర్ధారణకు సంబంధించిన ఈసీజీ తీశారు. ఆ రిపోర్ట్‌ల ఆధారంగా వైద్యులు విలువైన మందులను రోగులకు ఇచ్చారు. ప్రధానంగా సెప్టెంబర్ నుంచి జిల్లా వ్యాప్తంగా వైరల్ ఫీవర్స్‌తోపాటు ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలాయి. ఈ తరుణంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేశాయనే చెప్పవచ్చు. మెడికల్ క్యాంపులకు వైరల్ ఫీవర్స్‌తోపాటు షుగర్, బీపీ తదితర వ్యాధిగ్రస్తులు సర్వసాధారణంగానే వచ్చారు. ప్రధానంగా పెద్ద వ్యాధులకు సంబంధించి కీళ్ల, ఎముకలు, గర్భిణులు, కంటి సమస్యలతో బాధపడే వారు వైద్య శిబిరాలను ఆశ్రయించారు. రోగులకు ప్రత్యేక వైద్య నిపుణులు సేవలందించారు. పెద్ద జబ్బులున్న వారిని ఉగర్తించి అత్యుత్తమ వైద్యానికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. దీంతో ప్రభుత్వం ప్రజల 'ఆరోగ్యానికి అభయం' ఇచ్చిందనే ప్రశంసలందాయి.

మా ఊరికి పెద్ద డాక్టర్లు వచ్చారు



నాకు బీపీతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలున్నాయి. వృద్ధాప్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. గ్రామాలకే పెద్ద డాక్టర్లు వచ్చి వైద్యం అందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల సలహాలు పాటిస్తూ మందులు వాడుతున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఊరికే డాక్టర్లను పంపించి వైద్యం చేయించడం బాగుంది. – దండె పార్వతమ్మ, ఉప్పరపల్లె, ప్రొద్దుటూరు మండలం

నా ఆరోగ్యానికి భరోసా లభించింది



చిన్నపాటి ఆరోగ్య సమస్యలు వచ్చినా హుటాహుటిన టౌన్‌కు పోయేవాళ్లం. కొన్ని రోజుల క్రితం వైద్య సిబ్బంది, అధికారులు మా ఇంటికి వచ్చి మా కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు చేశారు. సమస్యలు ఉన్న వారి కోసం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మా ఊళ్లోనే పెట్టారు. పరీక్షలు చేయించుకున్నా. ఇప్పుడు మాకు ఎలాంటి దిగులు లేదు. నా ఆరోగ్యానికి భరోసా లభించింది. ముఖ్యమంత్రికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – మాబుపీరా, బొజ్జావారిపల్లె, ప్రొద్దుటూరు మండలం

ప్రజలకు మేలు జరిగింది



ప్రభుత్వం అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. వైద్య శిబిరాలు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యాయి. మెడికల్ క్యాంపుల ద్వారా రోగులకు మెరుగైన ఉచిత వైద్యం లభించింది. సాధారణ రోజుల్లో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు లభిస్తున్నాయి. – డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

దేశ ఐక్యతకు వల్లభ్ భాయ్ పటేల్ కృషి

- ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ఎస్పీ

కడప కోటిరెడ్డి సర్కిల్: దేశ ఐక్యతకు కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా ఎస్.పి శ్రీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. కడప నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'రన్ ఫర్ యూనిటీ' పరుగును జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. యువత ఐక్యమై ప్రపంచంలోనే దేశం అగ్రస్థానంలో నిలపాలన్నారు. ఈ సందర్భంగా నా దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి తోడ్పాటు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ. కృష్ణారావు, ఆర్ఐలు వీరేష, సోమశేఖర్ నాయక్, శ్రీశైలరెడ్డి, ఆనంద్, శివరాముడు, స్వామినాయక్, వెంకటేశ్వర్లు, అప్పల నాయుడు, రామస్వామిరాజు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి నడిపితే చర్యలు

జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి మద్యం తాగి వాహనం నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలలో మద్యం తాగినట్లు తెలిస్తే కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రమాదాల నుంచి సురక్షితంగా బయటపడేలా యువత వ్యవహరించాలని ఆయన కోరారు.

నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు ప్రణాళిక

స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కరవు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణ తయారుచేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. కడప జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం జరిగింది. ఆకెపాటి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని పలు మండలాల్లో నీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. గతంలో నీటిరవాణాకు సంబంధించిన కోట రూపాయల బకాయిలు త్వరలో చెల్లిస్తామన్నారు. జిల్లాలో మూడు ఇసుక రీచ్‌లున్నా, పలుచోట్ల ఇసుక అక్రమంగా తరలించడంతో భూగర్భజలాలు అడుగంటే సమస్య ఉందన్నారు. ఒంటిమిట్ట మండలం బాలరాజుపల్లెలో రీచ్ లేకపోయినా ఇసుక తరలిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారని, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు అడ్డుకట్ట వేయాలన్నారు. నవంబర్ 5న రాజంపేటలో ఆర్థో పెడిక్ మెగా హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చెన్నై, హైదరాబాద్ నుంచి నిపుణులు వస్తారని, మోకాళ్ల ఆపరేషన్ ఉచితంగా చేస్తారని తెలిపారు. సింగరయ్య కాలనీలో నీటి సమస్య ఉందని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. ట్యాంకర్ రూ.500 ఖర్చుచేసి ఇంటి నిర్మాణాలకు వినియోగించుకోవాలంటే పేదలకు తలకు మించిన భారమవుతోందన్నారు. సచివాలయ భవన నిర్మాణ పనులకు బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలని జెడ్పీ చైర్మన్ కోరారు. తమ మండలంలోని మున్నెల్లి సచివాలయ భవనాన్ని ఎందుకు ప్రారంభించలేకపోయారో చెప్పాలని బి.కోడూరు జెడ్పీటీసీ దావీద్ అడిగారు. మైదుకూరు, దువ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు కరీముల్లా కోరారు. ఉపాధి పనులు చేపట్టాలని సభ్యులు కోరారు. జలకళ కింద 70 బోర్లు మంజూరైనా వేయలేదని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ఆరోపించారు. రామసముద్రం పంచాయతీలో 220 బేస్‌మెంట్‌లు ఏర్పాటు చేసుకోగా బిల్లులు చెల్లించలేదని బి.కోడూరు జెడ్పీటీసీ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ. 102 కోట్లతో పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కింద రూ.102 కోట్లతో 2155 పనులు చేపట్టినట్లు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. వాటిలో రూ.40 కోట్ల విలువచేసే 1000 పనులు పూర్తిచేశామని తెలిపారు. రూ.34 కోట్లకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేయగా, రూ.30 కోట్లు విడుదల చేశబూరన్నారు. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అన్నమయ్య జిల్లాలో రూ.27.70 కోట్లతో 922 పనులు చేపట్టగా, రూ.6.16 కోట్ల పనులు పూర్తిచేశామని సీపీఓ వివరించారు.

ఆరుతడి పంటలే శరణ్యం

జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు



కలెక్టరేట్‌లో నీటిపారుదల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎంపీ, ప్రజాప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టుల్లో సరిపడా సాగునీరు లేనందున రబీలో ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ వి.విజయరామరాజు ఆదేశించారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డాక్టర్ సుధ, నగర మేయర్ కె.సురేష్ బాబులతో కలిసి స్థానిక కలెక్టరేట్‌లోని వ్యవసాయం, నీటిపారుదల అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్లలో తాగునీటి అవసరాలకు 31 టీఎంసీలు నీరు ఉన్నందున రబీలో వరి సాగు చేయరాదన్నారు. కేసీ కాల్వ, ఎస్ఆర్–1 పరిధిలో నీటిలభ్యత లేనందున ఆయకట్టు కింద రబీ పంటలు సాగుచేయరాదని రైతులకు సూచించాలన్నారు.

వెలుగోడు నుంచి నీరివ్వండి: ఎంపీ

రిజర్వాయర్లలో నీటిలభ్యత తక్కువ ఉన్నందున రబీ సీజన్‌లో పంటల సాగు ప్రశ్నార్థకంగా ఉందని ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. ప్రకృతి కరుణిస్తే తప్ప పంటల సాగుకు అవకాశం లేదన్నారు. కేసీ కాల్వ పరిధిలో వరికి ప్రత్యామ్నాయంగా వర్షాధార పంటలు సాగుచేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, వెలుగోడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యంపెరిగితే అక్కడి నుంచి నీరు అందించవచ్చన్నారు. నవంబర్ 1 నుంచి 18వ తేదీ వరకు వెలుగోడు ప్రాజెక్టు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని రాజోలుకు తీసుకువచ్చి కుందూ నది ద్వారా కేసీ ఆయకట్టుకు అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్, నీటిపారుదల అధికారులను ఆయన కోరారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు నేడు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవన్‌లో నాడు– నేడు పనులు, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల ఆరోగ్యం, మనబడి నాడు– నేడు పురోగతిపై ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈఓ, ఇంజినీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమావేశమై కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం సహించేది లేదు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో జరిగే అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ముద్దనూరు రోడ్డులోని హార్టికల్చర్, అగ్రికల్చర్ కళాశాలల్లోని హాస్టల్ వసతి గదుల నిర్మాణం, శిల్పారామంలో జరిగే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారి విస్తరణ, సిటీ సెంట్రమ్, షాపింగ్ కాంప్లెక్స్, మినీ సెక్రటేరియట్, మీట్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలన్నారు. ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, శ్యాంసుందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉన్నతవిద్యలో ఉద్యోగ విప్లవం

- వైవీయూలో 118 పోస్టులు, ఏఎఫ్‌యూలో 138 పోస్టులకు నోటిఫికేషన్
- దశాబ్దకాలం తర్వాత అందివచ్చిన అవకాశం
- ఉమ్మడి పోర్టల్ ద్వారా ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- ఆశావాహుల్లో ఆనందం



వైవీయూ ముఖద్వారం

వైవీయూ: రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ఉన్నతవిద్యలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావాహుల్లో ఆనందం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడంతో విశ్వవిద్యాలయ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 3220 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసింది ఇందులో భాగంగా యోగివేమన విశ్వవిద్యాలయంలో 118 పోస్టులకు, నూతనంగా ఏర్పాటైన డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయంలో 138 పోస్టులకు నోటిఫికేషన్లు జారీచేశారు. బ్యాక్‌లాగ్ నోటిఫికేషన్‌లతో పాటు, రెగ్యులర్ నోటిఫికేషన్‌లు జారీచేశారు. వీటితో పాటు రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో సైతం పోస్టుల భర్తీ చేపట్టనున్న నేపథ్యంలో జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సైతం అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హత, రాతపరీక్ష.. ఇంటర్వ్యూ ద్వారా..

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ, విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ విధానంలో నియామక ప్రక్రియ నిర్వహించనున్నారు. అభ్యర్థి అర్హతలకు అనగా పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్, స్లెట్, జేఆర్ఎఫ్, అంతర్జాతీయ, జాతీయ పబ్లికేషన్స్, పరిశోధన తదితర అంశాల ఆధారంగా పారదర్శకంగా అభ్యర్థికి మార్కులు కేటాయించనున్నారు. అదే విధంగా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్‌ల (కాంట్రాక్ట్ అధ్యాపకులు)కు యేడాదికి 1 మార్కు చొప్పున గరిష్ఠంగా 10 మార్కులకు వెయిటేజి ఇస్తారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి 4:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపికచేస్తారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు: రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో నోటిఫికేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మంగళవారం నుంచే రిజిస్ట్రేషన్ నిర్వహించుకునే అవకాశం కల్పించారు. దీంతో ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు వన్‌టైం రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత అభ్యర్థుల ఎంపిక చేసుకున్న విశ్వవిద్యాలయం, పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు..

యోగివేమన విశ్వవిద్యాలయం (రెగ్యులర్ ప్లస్ బ్యాక్‌లాగ్)

అసిస్టెంట్ ప్రొఫెసర్లు	43
అసోసియేట్ ప్రొఫెసర్లు	46
ప్రొఫెసర్లు	26
నాన్ అకడమిక్ పోస్టులు	03
మొత్తం	118

డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం

అసిస్టెంట్ ప్రొఫెసర్లు	81
అసోసియేట్ ప్రొఫెసర్లు	36
ప్రొఫెసర్లు	16
నాన్ అకడమిక్ పోస్టులు	05
మొత్తం	138

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయం: ఎంపీ అవినాష్‌రెడ్డి



మోడల్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

వేముల: రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. వేములలో పాడా నిధులతో నిర్మించిన ప్రభుత్వ భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి, నాగెళ్ల సాంబశివారెడ్డి, చల్లాగంగాదేవి, కె.వెంకట బయపురెడ్డి, రామలింగారెడ్డి, మరకా శివకృష్ణారెడ్డి, రాజారెడ్డి, రామాంజనమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీ సీజ్


సీజ్ చేసిన లారీ, నిందితులతో పోలీసులు

చక్రాయపేట : ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీతో పాటు అందులోని 300 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపారు. మంగళవారం అద్దాలమర్రి క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ 16టీహెచ్7927 నంబరు గల లారీలో బియ్యం బస్తాలు కనిపించాయన్నారు. వాటిపై విచారణ జరుపగా అవి అక్రమంగా తరలిస్తున్నవని గుర్తించి వెంటనే లారీతో పాటు అందులోని 300 బస్తాల బియ్యం సీజ్ చేసి చక్రాయపేట తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు. లారీలో ఉన్న ప్రొద్దుటూరుకు చెందిన మాబు షరీఫ్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ కుటుంబీకులకు అప్పగింత


మతిస్థిమితంలేని మహిళను తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ తిరుపాల్‌నాయక్

వేంపల్లె : మతిస్థిమితం లేని ఓ మహిళను వేంపల్లె ఎస్ఐ తిరుపాల్‌నాయక్ మంగళవారం కుటుంబీకులకు అప్పగించినట్లు మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలిలా.. మూడు నెలల క్రితం వేంపల్లె పట్టణంలో మతిస్థిమితం లేని మహిళను గుర్తించి ఎస్ఐ తిరుపాల్‌నాయక్ స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించారు. అనంతరం ఆమె అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ధానేస్‌పల్లి గ్రామానికి చెందిన మాధవి (మతిస్థిమితంలేని మహిళ)గా గుర్తించి, ఆమె తల్లి రాణమ్మకు అప్పగించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం చేస్తూ ఎస్ఐ తిరుపాల్‌నాయక్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : చలమారెడ్డిపల్లి క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. చెన్నూరుకు చెందిన ఆదినారాయణ, ఓబుల్ సుబ్బరాయుడులు టెంపో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2243 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశారు.

సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యకరం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


మీడియాతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడం పట్ల టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడంపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వ్యంగ్యంగా స్పందించారు. మంగళవారం సాయంత్రం కడప నగరంలోని 23వ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్కిల్ స్కాం కేసులో చంద్రబాబుకు విముక్తి లభించలేదని, ఆయనకు ఆరోగ్యం బాగాలేదు స్కిన్ ఎలర్జీ వచ్చింది...కంటిచూపు కోల్పోయే ప్రమాదముందని లాయర్లు ప్రాధేయపడితే న్యాయమూర్తి మానవతా హృదయంతో కనికరించి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చారన్నారు. చంద్రబాబుకు ఆరోగ్యం బాగాలేక బెయిల్ వస్తే టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నాలుగు వారాల తర్వాత మళ్లీ బాబు జైలుకెళ్లాల్సిందేనని, ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించాలన్నారు. ఈ నాలుగు వారాల్లో చంద్రబాబును మంచి వైద్యులకు చూపించి కంటిచూపు కోల్పోకుండా కాపాడాలని, చూపు పోతే ఆయన్ను చూసేవారు కూడా ఉండరని చెప్పారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్టుతో ప్రభుత్వానికి సంబంధం లేదు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జరిగిన చంద్ర బాబు అరెస్ట్‌తో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధ లేదని, ప్రభుత్వ కక్ష సాధింపు ఉంటే జైల్లో చంద్రబాబుకు అన్ని వసతులు వచ్చేవా... చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందని 2018లోనే ముంబయికి చెందిన ఐటీ, జీఎస్టీ, విజిలెన్స్ అధికారులు బాబు ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. అయితే ఆ అవినీతికి పాల్పడింది బాబే కాబట్టి ఆ లేఖను అప్పుడు తొక్కి పెట్టారన్నారు. సీఐడీ అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిస్తే కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించిందన్నారు. ప్రభుత్వ కక్షసాధింపు ఉంటే జైల్లో బాబుకు అన్ని వసతులు వచ్చేవా? అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి 16 నెలలు జైల్లో ఉంటే ములాఖత్‌లు తగ్గించాలి, వసతులు తగ్గించాలని టీడీపీ నాయకులు పిటిషన్లు వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గాని, ప్రభుత్వం గాని పిటిషన్లు వేసి ఉంటే ఇలాంటి వసతులు చంద్రబాబుకు ఉండేవి కాదన్నారు. 14 ఏళ్ల సీఎంగా, సుదీర్ఘ కాలం పార్టీ అధ్యక్షునిగా ఉన్న బాబును అరెస్ట్ చేస్తే ప్రజల్లో ఎలాంటి స్పందన లేదన్నారు. బాబు అవినీతి చేశాడని ప్రజలు నమ్ముతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నిఖిల్‌రెడ్డి, ఇస్మాయిల్, క్రిష్టారెడ్డి, ఖాజా హుసేన్, మోనార్క్, జావీద్, రామసుబ్బారెడ్డి, సుధీర్, షావలి పాల్గొన్నారు.

ఏపీపై కేంద్రం శీతకన్ను

రాజంపేట టౌన్ : ఆంధ్రప్రదేశ్‌పై కేంద్ర ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక గీతాంజలి జూనియర్ కళాశాలలో మంగళవారం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు, కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా ఆ రోజున వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తామని స్పష్టం చేసిన కేంద్రం, ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని అమీత్‌షా ప్రకటించడం సరైనది కాదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమకు కూడా కేంద్రం సహకరించడం లేదని వారు ఆరోపించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే రాయలసీమ జిల్లాల్లోని నిరుద్యోగులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను నిర్లక్ష్యం చేస్తున్నా రాష్ట్రంలోని బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎన్.నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ కోట స్థలాల ఆక్రమణ


కోటస్థలాల ఆక్రమణలపై విచారణ జరుపుతున్న పోలీసులు

గుర్రంకొండ : చరిత్రాత్మక గుర్రంకొండ కోట స్థలాలను కొంతమంది జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకున్నారు. అక్కడే ఉన్న పురావస్తుశాఖ బోర్డును ఆక్రమణదారులు పీకేశారు. జరిగిన సంఘటనపై స్థానిక పురావస్తుశాఖ అధికారి రామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప–బెంగళూరు జాతీయ రహదారి ఎన్‌హెచ్ 340 పైన గుర్రంకొండ కోట సరిహద్దుల్లో లక్షలాది రుపాయలు విలువచేసే స్థలాలు ఉన్నాయి. కోటలోని ఆనందిబాషా దర్గాకు వెళ్లే మార్గంలో గత రాత్రి కొతమంది జేసీబీలతో స్థలాలను చదును చేశారు. అక్కడే ఉన్న కోట గోడను కొంతమేరకు జేసీబీతో కూలదోసి అక్కడే ఉన్న కందకాల్లో పడేశారు. రోడ్డుపక్కన పురావస్తుశాఖ వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కూడా జేసీబీలతో పీకేసి కోట గోడ పక్కనున్న కాలువలో పడేశారు. లక్షలాది రుపాయలు విలువచేసే స్థలాలను చదును చేసి రాత్రికి రాత్రే బంకులను ఏర్పాటు చేశారు. దీంతో కోట ముఖద్వారం వద్ద రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికే సుమారు ఆరు బంకులు కోటస్థలాల్లో వెలిశాయి. జరిగిన సంఘటనపై స్థానిక పురావస్తుశాఖాధికారి రామ్మూర్తి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దిలీప్‌కుమార్, ఏఎస్ఐ నరసింహులు తమ సిబ్బందితో కలసి వెళ్లి ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణదారులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. జరిగిన సంఘటపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడని ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సీఐ వివరాల మేరకు మహావీర్ సర్కిల్ ప్రాంతంలో తిరుగుతుండేవాడు. అతన్ని గుర్తించిన వారు 9121100510, 9121100511 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని..


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దుల మల్లేశ్వరరెడ్డి (53) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చాపాడు మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన మల్లేశ్వరరెడ్డి నర్సరీలో కూలి పనికి వెళ్తుంటాడు. అతనికి భార్య పార్వతితో పాటు కుమారుడు శివారెడ్డి, శిల్ప అనే కుమార్తె ఉన్నారు. శివారెడ్డి హైదరాబాద్‌లో ఒక కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. మంగళవారం మల్లేశ్వరరెడ్డి కాకిరేనిపల్లె సమీపంలోని నర్సరీ వద్దకు పనికి వెళ్లాడు. పని ముగించుకొని సాయంత్రం అక్కడే పని చేస్తున్న మరో మహిళను కూర్చోబెట్టుకొని బైక్‌లో గ్రామానికి బయలుదేరాడు. పెద్దశెట్టిపల్లె సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బైక్‌లో వస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


గంగాభవానికి బ్యాగును అందజేస్తున్న బిలాల్ అహ్మద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోడ్డుపై పడి పోయిన హ్యాండ్‌బ్యాగును టూటౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. టూటౌన్ సీఐ తబ్రేజ్ వివరాల మేరకు... కృష్ణా సర్కిల్ నుంచి మాసాపేటకు వెళ్తున్న గంగా భవాని అనే మహిళ తన హ్యాండ్ బ్యాగును రోడ్డుపై పోగొట్టుకుంది. అదే మార్గంలో వెళ్తున్న ఆటో డ్రైవర్ బిలాల్ అహ్మద్ బ్యాగును గుర్తించి వెంటనే టూటౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగులో రూ.10 వేల నగదు, ఏటీఎం కార్డులు, ఐడీ కార్డులు ఉన్నాయి. పోలీసులు బాధితురాలికి సమాచారం ఇచ్చి బ్యాగును అప్పగించారు. నిజాయితీగా తనకు బ్యాగును అందజేసిన బిలాల్ అహ్మద్‌కు, పోలీసు శాఖకు ఆమె ధన్యవాదాలు తెలియజేసింది. అనంతరం బిలాల్ అహ్మద్‌ను సీఐ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జయరాముడు, సంజీవరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవీణ్, నందం సుబ్బయ్య సతీమణి అపరాజిత కలిసే
కుట్రపూరితంగా హత్యాయత్నం

- అపరాజితపై కేసు నమోదు చేయాలి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ప్రాణాపాయ స్థితిలో ఉన్న బెనర్జీకి ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ ఫొటోను చూపుతున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త బెనర్జీపై జరిగిన హత్యాయత్నంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డితోపాటు నందం సుబ్బయ్య సతీమణి అపరాజిత కుట్రలో భాగమేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రవీణ్‌తోపాటు అపరాజితపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి విచారించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ దళిత యువకుడైన బెనర్జీపై పాశవికంగా కొడవలితో దాడి చేయడంతో అతను తీవ్ర ప్రమాదంలో ఉన్నాడన్నారు. టీడీపీ నాయకులు వరదరాజులరెడ్డి, తదితరులు ఇది ఆకస్మికంగా జరిగిన దాడి అని, ప్రవీణ్‌కు సంబంధం లేదని మాట్లాడటం తగదన్నారు. టీడీపీ నాయకులకు దళితులంటే ఎందుకు ఇంత చిన్న చూపు అని ప్రశ్నించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బెనర్జీ ప్రాణాలను కాపాడేందుకు హైదరాబాద్‌కు తరలించామని తెలిపారు. అతని మెదడుకు 8.30 గంటల పాటు వైద్యులు సర్జరీ చేశారని, ఆపరేషన్‌కు సంబంధించిన ఫొటోలను ఎమ్మెల్యే ప్రదర్శించారు. హత్యాయత్నం కేసులో ఉన్న తర్వాత ఎవరినైనా పోలీసులు విచారిస్తారని, దానికి కోగటం ప్రతాప్‌రెడ్డి ఎందుకు ఉలికి పడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు.

ప్రవీణ్ తండ్రి ఓ డీఎస్పీతో మాట్లాడారు

పట్టణంలో బెనర్జీపై హత్యాయత్నం జరిగిన వెంటనే టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తండ్రి కోగటం ప్రతాప్‌రెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఓ డీఎస్పీతో పది మార్లు వాట్సాప్ కాల్ చేసి మాట్లాడరని, మరో ఇద్దరు లాయర్లను సంప్రదించారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ప్రతాప్‌రెడ్డి ఎందుకు ఊరు వదలి వెళ్లారన్నారు. శాంతియుత ప్రొద్దుటూరే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని, ప్రతీకార చర్యలకు తాను పూనుకోనన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసి సమర్థిస్తారా


బెనర్జీపై జరిగిన దాడి ఫొటోలను చూపుతున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన దళిత యువకుడు బెనర్జీపై దాడి చేయడమేగాకుండా ఈ సంఘటన యాదృచ్ఛికంగా జరిగిందని టీడీపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ దళిత నాయకులు ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న దళిత యువకుడిని పరామర్శించాల్సింది పోయి ఈ సంఘటన యాదృచ్ఛికంగా జరిగిందని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, సిసీహబ్ రాజేశ్వరరెడ్డి ఎలా మాట్లాడతారన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో బెనర్జీ నిందితుడిగా ఉన్నాడని, ఆయన సతీమణి అపరాజిత, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కలిసి వ్యూహం పన్ని ఈ కుట్ర చేశారన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో ఉన్న మిగతా వారికి కూడా అపరాజిత, ప్రవీణ్ వల్ల ప్రమాదం పొంచి ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ మాదిగ, వైఎస్సార్‌సీపీ నాయకులు స్నేకర్ భాస్కర్, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, జయంతి, సత్యం పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమర వీరుల
ముగింపు వారోత్సవాలు


జాతీయ సమైక్యత పరుగు నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో మంగళవారం పోలీసు అమర వీరుల ముంగిపు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అందరితో ఆయన జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమాండెంట్ వి. కేశవరెడ్డి జెండాను ఊపి (రన్‌ఫర్ యూనిటీ) జాతీయ సమైక్యత పరుగును ప్రారంభించారు. ఈ పోటీల్లో బెటాలియన్ ఆఫీసర్స్, సిబ్బంది, సిద్దవటం, బెటాలియన్ స్కూళ్ల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కె. వెంకటరెడ్డి, వి. జయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వీఆర్ఓ మృతి


మృతి చెందిన వీఆర్ఓ

నందలూరు (రాజంపేట) : మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలోని కాలువలో ప్రమాదవశాత్తు పడి అవసాని వెంకటేశ్వర్లు (46) మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మన్నూరు సీఐ వుల్లయ్య, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజంపేట సాయినగర్‌కు చెందిన మృతుడు గతంలో పొత్తపి వీఆర్ఓగా పనిచేశాడని, ప్రస్తుతం ముద్దనూరులో వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.